సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 6 । జూన్ । 2023



20 నుంచి రథోత్సవాలు

శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ వేంకటేశ్వర సంతాన వేణుగోపాల జగన్నాథ స్వామివారి ఆలయంలో రథోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. 8లో



గడువు పెంపు

ఏలూరు(మెట్రో) : మార్క్‌ఫెడ్‌ ద్వారా కొనుగోలు చేస్తున్న మొక్కజొన్న కొనుగోలు ఈ నెల 9 వరకు పొడిగించామని మార్క్‌ఫెడ్‌ జిల్లా మేనేజర్‌ గుప్తా సోమవారం తెలిపారు.

ఏలూరు డిప్యూటీ కమిషనర్‌గా అనురాధ



ఏలూరు టౌన్‌: ఏలూరు నూతన డిప్యూటీ కమిషనర్‌గా ఎస్‌.అనురాధ నియమితులయ్యారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా బదిలీపై వచ్చారు.

న్యూస్‌రీల్‌

స్పందన అర్జీలకు సరైన పరిష్కారం చూపాలి



భీమవరంలోని కలెక్టరేట్‌ స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్‌) : అర్జీదారుడి సమస్యకు పూర్తి పరిష్కారం లభించినప్పుడే స్పందనకు సరైన నిర్వచనమని కలెక్టర్‌ ప్రశాంతి అన్నారు. స్పందన సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ డివిజన్‌, మండల స్థాయిలో స్పందన దరఖాస్తులు స్వీకరించేవారు అర్జీదారుడి సమస్యను ఓర్పుతో విన్నప్పుడే సరైన పరిష్కారం చూపగలమన్నారు. స్పందన దరఖాస్తులు స్వీకరిస్తున్న సమయంలో అర్జీదారుడి స్థానంలో మనం ఉంటే అనే ఆలోచనతో వ్యవహరించాలన్నారు. నిర్ణీత సమయంలో అర్జీకి సరైన పరిష్కారాన్ని చూపాలని సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమం ద్వారా 183 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌.రామ్‌ సుందర్‌ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, డీఎస్పీ బి.శ్రీనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ యు.రవిప్రకాష్‌ అన్నారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రవిప్రకాష్‌ ఫిర్యాదుల్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 22 ఫిర్యాదులు అందగా వాటిలో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్‌ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులున్నట్లు వివరించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్‌ వె.ప్రసన్న వెంకటేష్‌, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్‌: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించనున్న దృష్ట్యా పటిష్ట ఏర్పాట్లు చేశారు. కలెక్టర్‌ వె.ప్రసన్న వెంకటేష్‌, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎస్పీ మేరీ ప్రశాంతి ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హెలీప్యాడ్‌ దిగి తిరిగి వెళ్లేంత వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. హెలిప్యాడ్‌, కాపర్‌డ్యామ్‌, ఈసీఆర్‌ఎఫ్‌ ప్రాంతాల్లో ఆయన పర్యటించనున్న దృష్ట్యా ఎక్కడికక్కడ గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. పనులు పురోగతిని సీఎం తిలకించేందుకు ఫోటో ఎగ్జిబిషన్‌ కూడా ఏర్పాటు చేశారు. సీఎం పర్యటించే ప్రాంతాలన్నీ కూడా స్క్వాడ్‌ బృందాలు తనిఖీ చేశాయి. కాన్వాయ్‌ ట్రయల్‌ రన్‌ కూడా నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.20 గంటల నుంచి 1.40 గంటల వరకు ప్రాజెక్టు పనులను పరిశీలించి అధికారులతో రివ్యూ చేస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ.. 41 కాంటూర్‌ లెవల్‌లోని నిర్వాసితుల్లో కొందరిని ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. మిగిలిన వారిని తరలించేందుకు చర్యలు చేపడతామన్నారు.

తణుకు ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారిపై విచారణ

తణుకు అర్బన్‌: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ కె.శివప్రసాద్‌ వ్యవహారంపై సోమవారం ఆస్పత్రికి వచ్చిన ప్రత్యేక బృందం విచారణ నిర్వహించింది. కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ మొగిలి వీరాస్వామి వేసిన కమిటీ వైద్యులు ఆస్పత్రిలో బాధితులతోపాటు పలువురిని విచారణ చేశారు. ముఖ్యంగా ఆస్పత్రిలో తన కుమార్తెకు చేయాల్సిన శస్త్రచికిత్సకు సంబంధించి వైద్యసేవలు అందించకుండా తన క్లినిక్‌కు రావాల్సిందిగా వైద్యాధికారి సూచించారని బాధితుడు సిరిమళ్ల శ్రీనివాస్‌ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ విచారణ ప్రారంభించారు. మరిన్ని అంశాలు తెరపైకి వచ్చినట్లుగా తెలుస్తోంది. వైద్యబృందం బాధితుడు శ్రీనివాస్‌తో మాట్లాడి సమాచారం సేకరించారు. విచారణలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు దాట్ల సుందరరామరాజు పాల్గొన్నారు.

సర్కారు బడులు కళకళ

- రెండో విడత నాడు- నేడులో 726 పాఠశాలల్లో సౌకర్యాలు
- జూన్‌ 12 లోపు 10 ప్రాధాన్యత పనుల పూర్తికి చర్యలు

ఆకివీడు: సర్కారు బడులు సకల సౌకర్యాలతో కళకళలాడుతున్నాయి. రెండున్నరేళ్లలోనే సర్కారు బడుల రూపురేఖలు మారిపోయాయి. నేలపై, నేల బల్లలపై, చాలీ చాలని బెంచీలపై సర్కారు బడుల్లో ఒకప్పుడు చదువులు కొనసాగించారు. పెంకులు జారిపోతూ వర్షానికి తడుస్తూ స్కూళ్లలో విద్యాభ్యాసం కొనసాగించేవారు. ఆ దుస్థితి నుంచి నేడు సర్కారు బడులకు మంచి రోజులు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్ని సుందరంగా తీర్చిదిద్ది, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి భావించి పాఠశాలలకు ఆధునిక వసతులు కల్పిస్తున్నారు. జిల్లాలో మొదట విడత నాడు-నేడులో 469 సర్కారు బడులను రూ.116.12 కోట్లతో అభివృద్ధి చేశారు. రెండో విడతలో 726 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.254.07 కోట్లు కేటాయించి, పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నారు.

ప్రాధాన్యతా పనులు	పాఠశాలలు
అంగన్‌వాడీ కేంద్రాలకు అదనపు గదుల నిర్మాణం	57
అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు	39
మరుగుదొడ్ల నిర్మాణం	499
మరుగుదొడ్ల మరమ్మతులు	329
తరగతి గదుల మరమ్మతులు	485
విద్యుత్‌ సదుపాయం	502
మంచినీటి సౌకర్యం(టైప్‌-1)	387
మంచినీటి సౌకర్యం(టైప్‌-2)	135
కిచెన్‌ షెడ్లు	375
గ్రీన్‌ బోర్డులు, ఫర్నీచర్స్‌	726

85 శాతం పనులు పూర్తి

రెండో విడతలో అధిక శాతం పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించేందుకే ప్రాధాన్యతనిచ్చారు. విద్యార్థులకు సరిపడినన్ని అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయించారు. అదనపు తరగతి గదుల పనుల్లో వేగం పెంచేందుకు కలెక్టర్‌ ప్రశాంతి సంబంధిత విద్యా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. రెండో విడత నాడు-నేడు పనుల్లో 10 ప్రాధాన్యత పనులు పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి చేయాలని కలెక్టర్‌ ఆదేశాలిచ్చారు. ఇప్పటికే 85 శాతం పనులు పూర్తి కావస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్ర భవనాలకు మరమ్మతులు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మతులు, తరగతి గదుల మరమ్మతులు, విద్యుత్‌ సదుపాయం, మంచినీటి పథకం అమలు, కిచెన్‌ షెడ్లు, పాఠశాలల్లో ఫర్నిచర్‌ సమకూర్చడం, గ్రీన్‌ బోర్డుల ఏర్పాటు వంటి వాటికి అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. పూర్తిగా శిథిలమైపోయిన భవనాల స్థానంలో కొత్తవాటిని త్వరతగతిన నిర్మించేందుకు చర్యలు చేపట్టారు.



నాడు-నేడు మొదట విడతలో సుందరంగా తయారైన ఆకివీడు జెడ్పీ ఉన్నత పాఠశాల



ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలోని జెడ్పీ స్కూల్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న రెండు అదనపు తరగతి గదులు

సంస్కరణలకు అనుకూలంగా వసతులు

ఈ విద్యాసంవత్సరం నుంచి నూతన సంస్కరణల్లో భాగంగా పలు ఉన్నత పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌తో విద్యాభ్యాసం ప్రారంభం కానుంది. జిల్లాలో 16 ఉన్నత పాఠశాలల్లో సీబీఎస్‌ఈని అమలుజేస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో ఇంగ్లీషు ల్యాబ్‌, లైబ్రరీ వంటి అదనపు సౌకర్యాలు కల్పించారు. అదనపు తరగతి గదుల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

పాఠశాలలు తెరిచేలోపు మౌలిక వసతులు



ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలు తెరిచే లోపు అన్ని పాఠశాలలకు మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నాడు-నేడు పనుల్లో ఇప్పటికే 63 శాతం పూర్తయ్యింది. ఈ నెల 10 లోపు మౌలిక వసతులు పూర్తి చేస్తాం.

– ఆర్‌.వెంకట రమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

శిథిల భవనం స్థానంలో కొత్త నిర్మాణం



జిల్లాలో శిథిలావస్థకు చేరిన పాఠశాలల భవనాల్ని తొలగించి కొత్తగా వాటికి 68 భవనాల నిర్మాణం చేపట్టాం. వాటి నిర్మాణం త్వరితగతిని పూర్తి చేసి, ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. రెండో విడత నాడు-నేడు పనులను రూ. 254.07 కోట్లతో చేపట్టాం.

– శ్యాం సుందర్‌, సర్వశిక్ష అభియాన్‌, పీఓ, పశ్చిమగోదావరి జిల్లా

పర్యావరణ సమతుల్యతను కాపాడుదాం



పేరుపాలెం తీరంలో ప్లాస్టిక్‌ వస్తువులను ఏరివేస్తున్న కలెక్టర్‌ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్‌, వివిధ శాఖల అధికారులు

- కలెక్టర్‌ పి.ప్రశాంతి
- పేరుపాలెం బీచ్‌లో ప్లాస్టిక్‌ ఏరివేత

మొగల్తూరు: పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్‌ పి.ప్రశాంతి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని పేరుపాలెం బీచ్‌ పరిశుభ్రం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే పనులు చేయబోమని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు కృషి చేస్తామని కార్యక్రమానికి హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ముఖ్య ఉద్దేశంగానే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణ సమతుల్యత పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో ఆజాదీ కా అమృత్‌ మహోత్సవం నిర్వహించిన విధంగానే ఈ కార్యక్రమాన్ని కొన్ని రోజులు జరుపుకుంటామని స్పష్టం చేశారు. ఎస్పీ యు.రవిప్రకాష్‌ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు ప్రతి ఏడాది జూన్‌ 5న పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుని భూమి మీద ఉన్న సకల జీవులను కాలుష్య కోరల నుంచి కాపాడుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణానికి హాని తలపెట్టే పనులు మానుకుని పర్యావరణానికి మంచి చేసే పనులు చేపట్టాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసు నుండే పర్యావరణ పరిరక్షణ వల్ల జరిగే మంచిని వివరించాలన్నారు. బీచ్‌ను సందర్శించే పర్యాటకులు ప్లాస్టిక్‌ బ్యాగులు, కవర్లు, గ్లాసులు వినియోగించడం మానుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. సబ్‌ కలెక్టర్‌ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ సముద్ర తీరంలో పర్యటించినప్పుడు ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌ వస్తువులే కనిపించేవన్నారు. వాటిని తొలగించి తీర ప్రాంతాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు.

కలెక్టర్‌ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్‌ ఇతర శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు, స్థానికులు సుమారు 4 కిలోమీటర్ల మేర ప్లాస్టిక్‌ వస్తువులను ఎత్తివేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గ్లోబల్‌ ఎన్విరాన్‌మెంటల్‌ స్టూడెంట్‌ అవేర్‌నెస్‌ ఆర్గనైజేషన్‌ కళాకారులు నిర్వహించిన కళాజాత ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్‌ చైర్మన్‌ పెండ్ర వీరన్న, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వర్లు, డీపీవో జీవికే మల్లిఖార్జునరావు, డీఎస్పీ రవిమనోహరాచారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్‌ వాకపల్లి ప్రసాద్‌, అటవీశాఖ అధికారి ఎండీ అబ్దుల్‌ ఖరి, మున్సిపల్‌ కమిషనర్‌ డాక్టర్‌ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ రహిత సమాజం సాధిద్దాం



పేరుపాలెం బీచ్‌లో సోమవారం ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన బాలాజీ అనే సైకత శిల్పి పర్యావరణంపై రూపొందించిన సైకత శిల్పాన్ని కలెక్టర్‌, ఇతర అధికారులు ప్రశంసించారు. ప్లాస్టిక్‌ రక్కసి నుంచి మూగ ప్రాణుల్ని కాపాడుదాం అనే నినాదంతో ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు.

– మొగల్తూరు

ఎండ ప్రచండం.. గాలి బీభత్సం

- విచిత్ర వాతావరణంతో ప్రజల ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా ఇదే పరిస్థితి

సాక్షి, భీమవరం: ఉమ్మడి జిల్లాలో విచిత్ర వాతావరణం నెలకొంది. పగలంతా భానుడి భగభగలతో అల్లాడిపోతున్న ప్రజానీకం రాత్రి సమయంలో ఈదురుగాలు, గాలి దుమారంతో బెంబేలెత్తిపోతున్నారు. రాత్రివేళ అక్కడక్కడా భారీ వర్షం, కొన్నిచోట్ల చిరుజల్లులతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతుంటే అదే సమయంలో ఈదులు గాలులకు విద్యుత్‌ సరఫరా నిలిచి ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లా వ్యాప్తంగా గ్రీష్మతాపంతో వృద్ధులు, పిల్లలేగాకుండా యువత కూడా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 7 గంటలకే సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడిపోతున్నారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల సమయానికి దాదాపు 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు విపరీతంగా చెమటలు పడుతున్నాయి. మధ్యాహ్నం సమయంలో జన సంచారం అంతగా లేకపోవడంతో షాపులను మూసివేస్తున్నారు. సాయంత్రం 5 గంటల వరకు ఇదే పరిస్థితి ఉంటుంది.

రాత్రి సమయంలో ఈదురు గాలులు

పగలంతా భానుడి భగభగలతో ఠారెత్తిపోతున్న ప్రజానీకం రాత్రి 7 గంటల తరువాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో చల్లబడుతోంది. అక్కడక్కడా కొద్దిసేపు భారీ వర్షంతో గ్రీష్మతాపం నుంచి ఉపశమనం కలుగుతుంటే మిగిలినచోట్ల చిరుజల్లులు కురుస్తున్నాయి. ఈదురుగాలుల ధాటికి కొన్ని చోట్ల చెట్లు, విద్యుత్‌ స్తంభాలు నేలవాలడంతో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి గాలుల వేగం తగ్గిన తరువాత మళ్లీ ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చీకటి సమయంలో విద్యుత్‌ పునరుద్ధరణకు విద్యుత్‌ శాఖ సిబ్బంది అవస్థలు పడుతున్నా విద్యుత్‌ సరఫరా నిలిచిన సమయంలో ప్రజల ఇబ్బందులు చెప్పనలనవికావు. తెల్లారేసరికి ఎండవేడితో తల్లడిల్లిపోతున్నారు.



భీమవరం పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వాసుపత్రి రోడ్డులో జనసంచారం లేక వెలవెలబోతున్న దృశ్యం



కొడమంచిలిలో ఈదురు గాలులకు ఎగిరి పోయిన ఇంటి పైకప్పు రేకులు

అకాల వర్షం.. ఈదురు గాలులు

పెనుగొండ: ఆదివారం అర్ధరాత్రి ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులు వీచాయి. భారీ వర్షానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో పాటు, పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్‌ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొడమంచిలి కుక్కలవారి పాలెంలో సానబోయిన శ్రీనివాస్‌ ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది, సంఘటన ప్రాంతాన్ని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్‌ అధ్యక్షుడు సుంకర సీతారాం సందర్శించి ఆదుకోంటామని భరోసా ఇచ్చారు.

నేలకూలిన విద్యుత్‌ స్తంభాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వన్‌టౌన్‌లో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులు, భారీ వర్షానికి అనేక ప్రాంతాలలో విద్యుత్‌ స్తంభాలు పడ్డాయి. ఉమెన్స్‌ కళాశాల ఏరియాలో 4, ఝాన్సీ రాణి ఆసుపత్రి వద్ద ఒకటి స్తంభం, హౌసింగ్‌ బోర్డులో ఒక స్తంభం పడింది. అనేక ప్రాంతాలలో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి.

జాగ్రత్తలు పాటించాలి



ఎండవేడిని తట్టుకోడానికి ఐస్‌తో కూడిన జ్యూస్‌లు తాగడం వల్ల చాలా ఇబ్బందులున్నాయి. ఐస్‌ తయారీలో స్వచ్ఛమైన నీరు వాడకపోతే రోగాల బారిన పడతారు. వేసవిలో ప్రధానంగా కూల్‌ డ్రింక్స్‌ వాడడం కంటే నిమ్మరసం, ఉప్పు, పంచదార కలిపిన నీరు తాగడం మంచిది. కొబ్బరి బొండం, మజ్జిగలో జీలకర్ర, కరివేపాకు, సబ్జాగింజలు కలిపి తాగాలి. చెమట రూపంలో శరీరంలోని ఖనిజాలు వెళ్లిపోయే పరిస్థితి ఉన్నందున దాహం లేకున్నా ప్రతి 2 గంటలకు తప్పనిసరిగా నీరు తాగాలి. అరటి పండు తినడం వల్ల కూడా వడగాలుల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఎవరైనా వడదెబ్బకు గురైతే సొంత వైద్యంతో అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్‌ మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి, భీమవరం

చంద్రబాబు చేతుల్లోనే వారాహి స్టీరింగ్‌

- చంద్రబాబు ఆదేశిస్తే పవన్‌ ఆపేయక తప్పదు
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: జనసేన ప్రచార రథం వారాహి స్టీరింగ్‌ చంద్రబాబు చేతిలో ఉందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌ చేపట్టనున్న యాత్రపై ఆయన మండిపడ్డారు. ఇప్పటికే రెండుసార్లు వారాహి వాహనంపై పవన్‌ కళ్యాణ్‌ యాత్ర వాయిదా పడిందని ఆయన గుర్తు చేశారు. పెంటపాడు మండలం ముదునూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌ తన పార్టీ కోసం, తనకోసం ఏం చేసుకున్నా తప్పు పట్టడానికి లేదన్నారు. అయితే తన కోసం, తన పార్టీ కోసం కాకుండా టీడీపీ, చంద్రబాబు కోసం పనిచేయడం సిగ్గుచేటు అన్నారు. జనసేన ప్రచార రథానికి ఏం పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని, అయితే వారాహి రథంపై ప్రచార యాత్ర గతంలో రెండుసార్లు ఎందుకు వాయిదా పడిందని ఆయన ప్రశ్నించారు. కొండగట్టు ఆంజనేయస్వామి గుడి నుంచి వారాహి రథంపై పవన్‌ కళ్యాణ్‌ ప్రచార యాత్ర ప్రారంభిస్తానని చెప్పి ఎందుకు ఆగిపోయారని మంత్రి కొట్టు సూటిగా ప్రశ్నించారు. కేవలం ఆ సమయంలో రాజధాని రైతుల పాదయాత్ర జరుగుతుంది కాబట్టి వారాహి వాహనంపై ప్రచార యాత్ర ఆపేయాలని చంద్రబాబు ఆదేశించడంతో పవన్‌ కల్యాణ్‌ కేవలం పూజలతోనే సరిపెట్టారన్నారు. ఆ తర్వాత రెండోసారి కూడా వారాహి వాహనంపై జనసేన ప్రచార యాత్ర ప్రారంభించాలని పవన్‌ కల్యాణ్‌ తలపెడితే ఆ సమయంలో లోకేష్‌ యువ గళం పాదయాత్ర కోసం ప్రచార యాత్ర ఆగిపోయిందన్నారు. ఈ విధంగా రెండుసార్లు చంద్రబాబు చెప్పగానే పవన్‌ కల్యాణ్‌ వారాహి వాహనాన్ని షెడ్లో పెట్టేశారన్నారు. ఇప్పుడు మూడోసారి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలో వారాహి వాహనంపై పవన్‌ కల్యాణ్‌ ప్రచార యాత్ర ప్రారంభిస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది జరిగేవరకు గ్యారెంటీ లేదన్నారు. ఏ సమయంలో అయినా చంద్రబాబు నుంచి యాత్ర ఆపేయమని ఆదేశాలు వస్తే పవన్‌ ఆపేయడం తప్ప మరో మార్గం లేదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

హామీలు అమలు చేయని బాబును ఎందుకు నిలదీయలేదు

ఎన్టీఆర్‌ చావుకు కారణమైన చంద్రబాబు పవన్‌ కల్యాణ్‌ కు దేవుడిలా కనిపించడం దారుణమని మంత్రి అన్నారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశానికి ఓటు వేయండి అని చంద్రబాబుకు కౌంటర్‌ గ్యారెంటీ ఇచ్చిన పవన్‌ కళ్యాణ్‌ ఆ తర్వాత హామీలు అమలు చేయకపోతే చంద్రబాబును ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు.

20 నుంచి జగన్నాథ రథోత్సవాలు

- లక్ష్మీపురంలో పూరీ తరహాలో ఏటా ఉత్సవాలు
- దశావతారాల్లో దర్శనమివ్వనున్న స్వామివారు


ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల విగ్రహాలు


రథంలో ఊరేగనున్న సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు


లక్ష్మీపురంలోని పురాతన జగన్నాథుని ఆలయం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ వేంకటేశ్వర సంతాన వేణుగోపాల జగన్నాథ స్వామివారి ఆలయంలో ఈనెల 20 నుంచి 29 వరకు జగన్నాథుని రథోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా పూరీ క్షేత్రంలో వలే ఉత్సవాలను ఇక్కడ అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా ఉత్సవాలను అత్యంత వైభవంగా జరపాలని అధికారులు నిర్ణయించారు. ఆలయాన్ని సుందరీకరించే పనులు మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న రథ వాహనంపై స్వామివారు లక్ష్మీపురం ఆలయం నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి ఊరేగింపుగా వస్తారు. అలాగే ఉత్సవాల ముగింపురోజైన 29న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి రథయాత్రగా వెళ్లనున్నారు. రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో జగన్నాథ స్వామివారు రోజుకో ప్రత్యేక అలంకారం (దశావతారాలు)లో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

ఆలయ చరిత్ర..

శతాబ్దకాలం నాటి ఈ ఆలయాన్ని ఒరిస్సా రాష్ట్రానికి చెందిన పూరీ వాస్తవ్యులు, మఠాధిపతులైన మంత్రరత్నం అమ్మాజీ అనే లక్ష్మీ అమ్మవారు నిర్మించారు. అందులో వేంకటేశ్వరస్వామి వారిని, అలాగే జగన్నాథస్వామి వారిని కూడా ఇదే ఆలయంలో ప్రతిష్ఠింపజేశారు. దీంతో ఒకే విమాన గోపుర శిఖరం కింద ఇద్దరు దేవతామూర్తులు కొలువై ఉండటం ఇక్కడి విశిష్టతగా పండితులు చెబుతారు. అప్పటి నుంచి కల్యాణోత్సవ, పవిత్రోత్సవాలతో కైంకర్యాలను మహా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ద్వారకాతిరుమలను ఎగువ తిరుపతిగా, లక్ష్మీపురంను దిగువ తిరుపతిగాను భక్తులు తలవడం పరిపాటిగా వస్తుంది. శ్రీవారి దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకున్న తరువాత జీర్ణోద్ధరణ గావించి మరింత అభివృద్ధి చేశారు. ఈ ఆలయంలో వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లతో పాటు జగన్నాథ స్వామి, బలరామస్వామి, సుభద్రాదేవుల సన్నిధి, ఆళ్వారుల సన్నిధి, శ్రీ సంతాన వేణుగోపాలస్వామి సన్నిధి ఉన్నాయి.

దశావతారాలు ఇలా..


- 20న మత్స్యావతారం
- 21న కూర్మావతారం
- 22న వరాహావతారం
- 23న నరసింహావతారం
- 24న వామనావతారం
- 25న పరశురామావతారం
- 26న రామావతారం
- 27న కృష్ణావతారం
- 28న కల్కి అవతారం
- 29న శ్రీవేంకటేశ్వర స్వామి అలంకారం

తనువు చాలిస్తే కానీ బాకీ రాలేదు

యలమంచిలి: ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రూ.లక్షలు డిపాజిట్ చేసిన తరువాత ఐపీ పెట్టడంతో సొమ్ము రాదనే బెంగతో ఆరోగ్యం క్షీణించి ఓ మహిళ మృతి చెందింది. దీంతో బంధువులు ఆగ్రహించి సదరు సంస్థ యజమాని ఇంటి వద్దకు ఆమె మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకువెళ్లి నిలదీసి బాకీ వసూలు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఊటాడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పాలకొల్లులో ఫైనాన్స్ కంపెనీ ఏర్పాటు చేసి భారీగా వ్యాపారం చేశాడు. బంధువులు, స్నేహితులు నమ్మి అతని ఫైనాన్స్ కంపెనీలో కోట్లాది రూపాయలు డిపాజిట్ చేశారు. నాలుగేళ్ల క్రితం అతను సుమారు రూ.100 కోట్లకు పైగా నష్టాలు చూపించి ఐపీ పెట్టాడు. అప్పటి నుంచి డిపాజిట్‌దారులు లబోదిబోమంటున్నారు. ఈ నేపథ్యంలో యలమంచిలికి చెందిన ఒక బాధిత మహిళ (45) సొమ్ము కోసం బెంగపెట్టుకుని ఆరోగ్యం క్షీణించడంతో పాలకొల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం మరణించింది. దీంతో ఆగ్రహించిన బంధువులు ఆమె మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కించుకుని సదరు వ్యాపారి ఇంటికి వెళ్లి నీ వల్లనే ఈమె చనిపోయిందని అదే అంబులెన్స్‌లో అతన్ని ఎక్కించుకుని యలమంచిలి తీసుకువచ్చారు. ఆమె మృతదేహం వద్దే రాత్రంతా అతన్ని కూర్చోపెట్టి బాకీ డబ్బులు ఇచ్చి వెళ్లాలని గట్టిగా హెచ్చరించారు. దీంతో సోమవారం బాకీ సొమ్మును (రూ.4.50 లక్షలు) కుటుంబ సభ్యులకు చెల్లించి బయటపడ్డాడు. ఇదిలా ఉండగా, ఈలోపు ఫైనాన్స్ వ్యాపారిని కిడ్నాప్ చేశారనే వార్త పాలకొల్లు, పరిసర గ్రామాల్లో వ్యాపించడంతో అతని బాకీదారులంతా కారులు వేసుకుని సోమవారం యలమంచిలి వచ్చారు. కిడ్నాప్ కాదని బాకీ వసూలు కోసం ఇదంతా జరిగిందని తెలిసి వారంతా వెనుదిరిగారని సమాచారం.


8న ఈపీసీ జాతీయ సమావేశం

రాష్ట్ర వైస్ చైర్మన్ అమర్‌నాథ్ వెల్లడి


వివరాల్ని తెలుపుతున్న పువ్వాడ రాజా అమర్‌నాథ్

ఆకివీడు: సూక్ష్మ, మధ్య తరహా వ్యాపారులకు అండగా ఉన్న ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ జాతీయ సమావేశం ఈ నెల 8న ఆకివీడులో నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్ పువ్వాడ రాజా అమర్‌నాథ్ చెప్పారు. సోమవారం ఆయన ఆకివీడులో విలేకరులకు వివరాలు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఈ సంస్థ సూక్ష్మ, మధ్య తరగతి వ్యాపారస్తులకు రుణాలు అందించడం ద్వారా స్వయం సమృద్ధి, స్వావలంబన సాధించే దిశగా కృషి చేస్తోందన్నారు. రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు వారి వ్యాపారాభివృద్ధికి, పరిశ్రమల వృద్ధికి, ఏర్పాటుకు, రుణ సదుపాయానికి సంస్థ తోడ్పాటు అందిస్తుందన్నారు. సమావేశానికి కౌన్సిల్ జాతీయ చైర్మన్ విజయ్‌కుమార్, వైస్ చైర్మన్లు పవన్ కుమార్‌శర్మ, అనిల్ కుమార్ శ్రీవాస్, దుర్గా నాగ ప్రసాదరెడ్డి, రాష్ట్ర చైర్మన్ గిద్దలూరి సంపత్ కుమార్, తెలంగాణ చైర్మన్ బి.వేణుగోపాలరావు తదితరులు హాజరవుతారని అమర్నాథ్ చెప్పారు.

20 టన్నుల పీడీఎస్ రైస్ పట్టివేత


బియ్యం లోడు లారీతో అధికారులు

పాలకొల్లు అర్బన్: పామర్రు నుంచి కాకినాడకు లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న 20 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని కొత్తపేట వద్ద హైవేపై సోమవారం పౌర సరఫరాల శాఖ అధికారులు, రూరల్ ఎస్సై పట్టివేశారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో ఈ దాడి చేసి లారీతో సహా రూ.5 లక్షల విలువైన 400 బస్తాల్లోని 20 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం లోడు లారీని పాలకొల్లు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఎస్‌డీటీ ఐవీవీ సత్యనారాయణ చెప్పారు. బియ్యం యజమాని పామర్రుకి చెందిన రమేష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. దాడిలో రూరల్ ఎస్సై సరిదే శ్రీనివాసరావు, పోలీసులు పాల్గొన్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

జంగారెడ్డిగూడెంలో 3.5 టన్నుల బియ్యం స్వాధీనం

జంగారెడ్డిగూడెం: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులతో కలిసి స్థానిక ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద తనిఖీలు చేస్తుండగా, బొర్రంపాలెం నుంచి పిఠాపురానికి 3500 కేజీల పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అక్రమంగా బియ్యాన్ని రవాణా చేస్తున్న పిఠాపురానికి చెందిన బ్రహ్మదేవ శ్రీనును అరెస్టు చేసి, బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఎస్‌డీటీ కె.రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గడపగడపకు సంక్షేమం


పెంటపాడు: ముదునూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల వల్ల అందిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రమాణం చేస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు

మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఇంటితోపాటు పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం తణుకు మునిసిపల్ కార్యాలయ ఆవరణలో మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చెత్త, వ్యర్థాలు బయట పారేస్తున్నాం కదా అనే అభిప్రాయం వద్దని. ఆరుబయట పారవేయకుండా సహకరించినప్పుడే పర్యావరణాన్ని కాపాడిన వారం అవుతామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ చిన్న జాగ్రత్త తీసుకుంటే ఆరోగ్యకరమైన వాతావరణంలో మనం జీవనం సాగించవచ్చన్నారు. మునిసిపల్ కార్యాలయ ఆవరణలో మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, మునిసిపల్ కమిషనర్ పర్యావరణాన్ని కాపాడుదామని ప్రమాణం చేయించారు. అనంతరం చెత్త పారవేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, సెక్రటరీలు, ఆర్పీలందరికీ మొక్కలు పంపిణీ చేసి ర్యాలీ నిర్వహించారు. తణుకుకు చెందిన పద్మజ నృత్య కళా అకాడమీ చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పసిబిడ్డ వైద్యానికి ఆదుకోండి సారూ..


తల్లిదండ్రులు, పాపకు పెరుగుతున్న నుదురు భాగం (అంతరచిత్రం)

పాలకొల్లు సెంట్రల్: అరుదైన సమస్యతో బాధపడుతున్న తమ మూడు నెలల పసిబిడ్డ వైద్యానికి దాతలు సహకరించి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీ 25వ వార్డులో నివాసం ఉంటున్న జక్కంపూడి వెంకటేష్, దేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వెంకటేష్ స్థానికంగా ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుండగా, భార్య దేవి 11వ సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తోంది. వీరి చిన్న కుమార్తె మూడు నెలల పసికందు. ఈ చిన్నారి అనారోగ్యంగా ఉండటంతో స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లగా వారం పాటు చికిత్స చేసినా తగ్గలేదు. దీంతో నరసాపురంలో ఓ వైద్యుడి సలహా మేరకు భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా పాప తలలో ఉన్న ఎముకలు కలిసిపోయి ఉన్నాయని, దీంతో మెదడు పెరిగే పరిస్థితి లేదని తేల్చారు. దీనిని క్రానియో సినోస్టోసిస్ అంటారని, దీని వల్ల అందరిలా కాకుండా తల నుదురు భాగం ముందుకు పెరుగుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీలో ఇందుకు చికిత్స లేదని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించడానికి సుమారు రూ.4 లక్షలు ఖర్చవుతుందని, పాపకు చికిత్స ఎంత త్వరగా చేయిస్తే అంత మంచిదని, లేదంటే తలలో నీరు పడితే ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు చెప్పారని తల్లిదండ్రులు వెంకటేష్, దేవి కన్నీరుమున్నీరయ్యారు. తమకు అంత సొమ్ము ఖర్చు చేసి వైద్యం చేయించే స్తోమత లేదని, దాతలు లేదా ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీకి చేరుకుంటున్న విద్యార్థులు

నూజివీడు: వేసవి సెలవులు పూర్తి కావడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీకి విద్యార్థులు చేరుకుంటున్నారు. గత నెల 14 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి సెలవులు ఇవ్వడం తెలిసిందే. సోమవారం తరగతులు పునఃప్రారంభం కావడంతో రాష్ట్రంలోని దూరప్రాంతాల నుంచి విద్యార్థులు రైళ్లు, బస్సుల ద్వారా ట్రిపుల్ ఐటీకి వస్తున్నారు. సాయంత్రానికి నూజివీడు ట్రిపుల్ ఐటీకి సంబంధించి 1,262 మంది విద్యార్థులు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి సంబంధించి 51 మంది విద్యార్థులు చేరుకున్నారు. మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరవుతారని ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. కళాశాల ప్రధాన గేటు వద్ద వచ్చిన విద్యార్థులందరూ తమ ఐడీ కార్డులను చూపించి రిపోర్టు చేసిన తరువాతే సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు చేసి లోపలికి పంపిస్తున్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరు క్రీడాకారులు

ఏలూరు రూరల్: ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి జి.శ్రీనివాస సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరిలో ఏలూరు సెయింట్‌థెరిస్సా జూనియర్ కళాశాల విద్యార్థినులు పి.వినయ, డి.పావనిప్రియ, వి.యామినితో పాటు యువకులు ఎ.సూర్యకిరణ్, జె.శివకృష్ణ, భీమవరానికి చెందిన హరిత ఉన్నారని వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఢిల్లీలో ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు జరిగే పోటీల్లో వీరు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. క్రీడాకారులను పీడీ కె.మురళీకృష్ణ తదితరులు అభినందించారు.

విజయవాడ వెళ్లి పింఛను సొమ్ము అందజేత


విజయవాడలో విస్సా రామారావుకు పింఛను సొమ్ము అందజేస్తున్న వలంటీర్ బుజ్జిబాబు

యలమంచిలి: విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడి వద్దకు వెళ్లి పింఛను సొమ్ము అందజేయడంతో వలంటీర్ యర్రమిల్లి బుజ్జిబాబు సేవలను పులువురు అభినందించారు. వివరాల్లోకి వెళితే.. అడవిపాలెం గ్రామానికి చెందిన విస్సా రామారావు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ యర్రమిల్లి బుజ్జిబాబు సోమవారం విజయవాడ వెళ్లి రామారావుకు పింఛన్ సొమ్ము అందజేశారు. వలంటీర్‌ను ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, అడవిపాలెం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లుల వెంకటరమణ అభినందించగా, రామారావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పరారీలో ఉన్న నలుగురు నిందితుల అరెస్టు

కాళ్ల: రొయ్యల లారీ అపహరణ కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరపరచగా రిమాండ్ విధించినట్లు ఆకివీడు సీఐ రామకృష్ణ సోమవారం చెప్పారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులకు గాను మే 10వ తేదీన నలుగురిని అరెస్టు చేయగా, మరో నలుగురు పిటక ధనరాజు, దాసిరెడ్డి కుమార్‌స్వామి, పిటక స్వామి సాయి, వేగి సుధాకర్ పరారీలో ఉన్నారన్నారు. సోమవారం వీరిని అరెస్టు చేయడంతో పాటు రూ.1.35 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో వృద్ధుడి దురాగతం

ఆకివీడు: మద్యం మత్తులో ఓ వృద్ధుడు తన మనువరాల్ని రైలు పట్టాలపై పడుకోబెట్టిన సంఘటన శనివారం రాత్రి దుంపగడప రైల్వే గేటు, స్టేషన్ మధ్య ప్రాంతంలో జరిగింది. స్థానికులు, ఆటో డ్రైవర్లు గుర్తించి వెంటనే బాలికను బయటకు తీసుకువచ్చి, ఆమెను, వృద్ధుడిని పోలీసులకు అప్పగించారు. నిడదవోలు నుంచి గుడివాడకు తన మనువరాల్ని ఇంటికి తీసుకువెళుతుండగా ఆకివీడు స్టేషన్‌లో దిగి ఈ దుశ్చర్యకు పాల్పడబోయాడు. ఎస్సై రాజారెడ్డి వృద్ధుడి కుమారుడికి ఫోన్ చేసి, మనువరాల్ని, వృద్ధుడ్ని సోమవారం అప్పగించారు.

క్లుప్తంగా

పెంటపాడు ఎంపీడీవోగా బాలాజీ



పెంటపాడు ఎంపీడీవోగా నియమితులైన బాలాజీని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న సిబ్బంది

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ఎంపీడీవోగా సీహెచ్. బాలాజీ నియమితులయ్యారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన దామోదరరావు పెరవళి వెళ్లడంతో నూతన ఎంపీడీవోగా బాలాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, భూషణం, సీతారామరాజు, పంచాయతీరాజ్ ఏఈ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. వికాసం



గ్రంథాలయంలో క్రాఫ్ట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గ్రేడ్-1 గ్రంథాలయంలో ఆహ్లాదకరంగా వేసవి శిక్షణా శిబిరం జరిగింది. వేసవి విజ్ఞాన తరగతులను 28వ రోజు సోమవారం గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఎ.జనార్ధనరావుచే క్రాఫ్ట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు స్వంతంగా ఇంటి వద్ద పలు కాగితాలతో వివిధ ఆకృతులను తయారు చేశారు. వాటిని గ్రంథాలయంలో ప్రదర్శించారు. శిక్షణా శిబిరంలో నేర్చుకొన్న పలు సబ్జెక్ట్స్ ఇంగ్లీషు, సైన్సుల పై విద్యార్థులకు అవగాహన కోసం విశ్రాంత ఎంఈఓ ఎస్.సాల్మన్‌రాజు పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు ప్రత్తి వీరాస్వామిచే కథలు, నీతి కథలు, పుస్తకాలు చదివించడం, ఆట పాటలు నేర్పించారు.

మంత్రి పరామర్శ



కత్తవపాడులో జవ్వాది సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: మండలంలోని కత్తవపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు జవ్వాది సురేష్ భార్య జవ్వాది సునీత(31) ఆదివారం అనారోగ్య కారణాలతో మృతి చెందడం జరిగింది. దీంతో రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం జవ్వాది సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అత్తిలి మండలం సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ బుడితి సుజన్ కుమార్ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కె ఇల్లిందల పర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర చంద్ర దర్శన వేడుక



తంగిరాల గోపాల కృష్ణ, విజయలక్ష్మీలను అభినందిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, తదితరులు

తణుకు టౌన్: మండల కేంద్రమైన ఇరగవరంలోని పాలేశ్వరస్వామి ఆలయం చైర్మన్ తంగిరాల పాలగోపాలకృష్ణ, విజయలక్ష్మీ దంపతులు నిర్వహించిన సహస్ర చంద్ర దర్శనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సోమ0వారం తణుకులోని చిట్టూరి హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పాల గోపాల కృష్ణ, విజయలక్ష్మీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, పలు గ్రామాల ప్రముఖులతో పాటు తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి, సుశర్మ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు ఒకే ఒక అర్జీ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చినతాడేపల్లి గ్రామానికి చెందిన ఎస్.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి తనకు పీఎం కిసాన్ పథకం రావడం లేదని అర్జీ అందజేశారు. ఈ సమస్య పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖకు పంపించినట్లు ఎంపీడీవో విశ్వనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అత్తిలి మండలం : బల్లిపాడులో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఉమర్ ఆలీషా పీఠం సభ్యులు



పెంటపాడు : డీఆర్ గోయంకా కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎఫ్ఎంసీ ఏరియా మార్కెటింగ్ మేనేజర్ కుమార్‌రాజు అన్నారు. సోమవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఎఫ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్‌రాజు మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి ఐ.రమేష్, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణం అందరి బాధ్యత

పెంటపాడు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్యాంబాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, విక్టర్ ప్రేమ్‌సాగర్, విజయ్‌బాబు, గంధం వాణి, కవి రచయిత సుంకర గోపాల్, రమదేవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, వ్యవసాయ సాంకేతిక విజ్ఞాన అనుప్రయోగ సంస్థ వారి ప్రణాళిక మేరకు సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవి వర ప్రసాద్ రెడ్డి, శాలిరాజు, వెంకట సతీష్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), కేంద్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) ఆదేశాలు మేరకు పర్యవరణ పరిరక్షణ కోసం సోమవారం మొక్కల నాటారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ ట్రైనర్స్, స్టూడెంట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మానవాళి మనుగడ

తణుకు టౌన్: పర్యావరణ పరిక్షణ ద్వారానే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని దీనికి విద్యార్థులు అవగాహనతో మెలగాలని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మానుకొండ శ్యాంబాబు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అవగాహనా ర్యాలీ నిర్వహించి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు, వలంటీర్ల ఆధ్వర్యంలో సోమవారం మహిళా కళాశాల నుంచి తణుకు పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ యూ లక్ష్మీ సుందరి బాయి, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్లు జీ రమ్య, సీహెచ్ రమేష్ బాబు, వలంటీర్లు పాల్గొన్నారు. తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడాలి

అత్తిలి: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తే పర్యావరణాన్ని పరిరక్షించగలమని, దానికోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం బల్లిపాడు ఆశ్రమ శాఖలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధనుమూరి వెంకటేశ్వరరావు, ట్రస్ట్ కార్యకర్తలు చీపురపల్లి సత్యనారాయణ, కమ్మంపాటి సర్వమూర్తి, యర్రంశెట్టి శివన్నారాయణ, యర్రంశెట్టి సురేష్‌కుమార్, ఆనంద్‌కుమార్, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

శశిలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం పట్టణంలోని శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి డి.కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్. ఎన్ఎస్ఎస్ అధికారి సల్మాన్ బాషా, అధ్యాపకులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వాసవి జీఎంఆర్ డిగ్రీ కళాశాలలో...

వాసవి జీఎంఆర్ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ వీఎస్ఎన్ శ్రీనివాసు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.గంగాప్రసాద్, అధ్యాపకులు పీఎస్‌జీ కిషోర్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి



తణుకు : మొక్కలు నాటుతున్న సంస్థ అధికారులు

తణుకు: తణుకు ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పరిశ్రమ అదనపు కార్యదర్శి పీవీఎస్ విశ్వనాథ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ఇందుకోసం మానవాళి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పరిసరాల్లో విధిగా మొక్కలు నాటాలన్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి తద్వారా భూసంరక్షణ చేసుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ ఆవరణలో మొక్కలు నాటారు. సంస్థ టెక్నికల్ అడ్వయిజర్ గుల్లపల్లి రంగారావు, సివిల్ అడ్వయిజర్ ఎం.రామారావు, పర్యావరణ మేనేజర్ బి.తిమ్మరాజు సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం (టీఓసీ) : కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు



తాడేపల్లిగూడెం మండలం : మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో మొక్కలు నాటుతున్న ఎఫ్ఎంసీ ప్రతినిధులు



తణుకు : మొక్కలు నాటుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

శరవేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు





తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి దంపింగ్ యార్డు వద్ద నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కుంచనపల్లి ఎస్సీ ఏరియాలో విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి ఒక్కసారిగా వీచిన ఈదురు గాలుల ధాటికి ఆరుగొలను, కుంచనపల్లి, దండగర్ర తదితర గ్రామాల్లో వ్యవసాయ, ఇంటి అవసరాల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం రాత్రంతా విద్యుత్ సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కుంచనపల్లి ఎస్సీ ఏరియాలో మరమ్మతు పనులు పూర్తి చేసి, సోమవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. నందమూరు, మారంపల్లి గ్రామాల్లోనూ సోమవారం తెల్లవారు జామున విద్యుత్ సరఫరా చేశారు. గత రెండ్రోజుల క్రితం జగన్నాథపురం, మాధవరం, మోదుగ గుంట, ఆరుగొలను, ఉప్పరగూడెం తదితర గ్రామాల్లో వీచిన ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను అప్పట్లోనే కొత్త వాటిని ఏర్పాటు చేశారు. తిరిగి ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మరలా విరిగిపోవడంతో వాటి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనుల నిమిత్తం వ్యవసాయ మోటార్ల వినియోగం ఉంది. పలు చోట్ల వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసే స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వీటి పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యుత్ సరఫరా చేస్తామని కుంచనపల్లి సబ్ స్టేషన్ ఏఈ అల్లు రామకృష్ణ తెలిపారు.

ముగిసిన వరాల వెంకన్న కల్యాణ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు పవళింపు సేవతో ముగిసాయి. ఉదయం మేళతాళాలతో శంఖుచక్కాలను ఊరేగింపుగా కొలను వద్దకు వెళ్లిన భక్తులు స్వామివారికి చక్రస్నానాలు ఆచరించారు. రాత్రి పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించి పుష్పయాగోత్సవం జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి పవళింపుసేవలో పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ భారత బచావో ఆధ్వర్యంలో సోమవారం తాలూకా ఆఫీస్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, భారత్ బచావో కార్యదర్శి ఎస్‌కే మస్తాన్‌లు మాట్లాడుతూ ఎంపీని అరెస్టు చేయకుండా బీజేపీ హోంశాఖ అడ్డుకోవడం సరికాదన్నారు. రెజ్లర్లకు న్యాయం జరగకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పెంటపాడు (మం) వల్లూరుపల్లి గ్రామం కొమ్మిరెడ్డి బంగారయ్య S/o సత్యనారాయణ పేరుతో గల డాక్యుమెంట్ వల్లూరిపల్లి గ్రామం వంతెన వీధిలో 242.1/2 చ॥గల స్థలానికి చెందిన డాక్యుమెంట్ నెం. 2738/ 1992 ఈ డాక్యుమెంట్ ఫోటోస్టాట్ తీయించుటకు వల్లూరుపల్లి నుండి పెంటపాడు వెళ్ళుచుండగా మధ్య మధ్యంలో పోయినది దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

కొమ్మిరెడ్డి ప్రసాద్, 99085 62342

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ముదునూరులో రెండోరోజు గడపగడపకు ప్రభుత్వం



ముదునూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ప్రతి గ్రామంలోను ప్రజా సంక్షేమంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సోమవారం ముదునూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో చంద్రబాబు చేసిన ఎన్నికల వాగ్దానాలు, మ్యానిఫెస్టోలు తుంగలో తొక్కారన్నారు. రైతు రుణాలు, డ్వాక్రా రుణాలు రద్దు చేయలేదని కొట్టు సత్యనారాయణ విమర్శించారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అవినీతి రహితంగా, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా జరుగుతుందన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. టీడీపీ మహానాడులో ముందస్తుగా రాబోయే ఎన్నికల గురించి మ్యానిఫెస్టో ప్రకటించి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు చంద్రబాబులా దోచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి వాటిని నెరవేర్చినప్పుడే ప్రజలు సంతోషిస్తారన్నారు. ప్రజలు జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో పని చేస్తున్నందుకు గర్వపడాలన్నారు. అందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్లతో పాటు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యసెంటర్, ఇతర భవనాలు ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామీణ పాఠశాలలు నాడు - నేడు పనుల్లో భాగంగా కోట్లాది రూపాయలు అందించడంతో పాటు, విద్యార్థులకు పౌష్టికాహారలోపం లేకుండా జగనన్న గోరుముద్ద ప్రత్యేక మార్పులు చేసి అందిస్తున్నారన్నారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్, సొసైటీల అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, బూరాడ శ్రీనివాస్, సర్పంచ్ ధాన్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కొణతాల, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, పొట్ల ఏడుకొండలు, దేవాబత్తుల నాగమణి బాబి, పార్టీ నాయకులు బోణం వీరయ్య, నల్లమిల్లి విజయానందరెడ్డి, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, పలు శాఖల ఏఈలు, సిబ్బందితో పాటు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు వెంకట్రామన్నగూడెంకు మంత్రి గోవర్ధన్‌రెడ్డి రాక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం డా.వైఎస్సార్ ఉద్యా న విశ్వవిద్యాలయంలో నిర్మించిన సెంట్రల్ లైబ్రరీని మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వ్యవసాయ శాఖమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం బాలికల వసతి గృహానికి శంకుస్థాపన చేయనున్నారు. ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొంటారు.

రైలు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ఆధీనంలో ఉన్న రైల్వేలకు సంబంధించి ఎటువంటి రైలు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్ర తలు తీసుకొంటూ, నివారణ చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఒడిశా బాలాసోర్‌లో కోరమండల్, బెంగుళూర్,-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఘటనకు సంబంధించి చనిపోయినవారికి జిల్లా కమిటీ తరుపున జిల్లా అధ్యక్షుడు జుత్తిగా నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి ఆకుల హరే రామ్, నాయకులు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డిలు సంతాపం తెలిపి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రమాదంలో అమాయక ప్రజలు మృతి చెందడం, వందలాది మంది క్షతగాత్రులు అవ్వడం బాధకరంగా ఉందన్నారు. మృతులకు, క్షతగాత్రులకు వైద్యం, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

వలంటీర్లు సేవా సారథులు

తాడేపల్లిగూడెం అర్బన్ : స్థానిక 22వ వార్డులో వలంటీర్లకు వందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొట్టు విశాల్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ముఖ్యపాత్ర వలంటీర్లదే అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఉన్న ఊర్లోనే ఉపాధి కల్పిస్తానని ఇచ్చిన మాటను అమలు చేశారన్నారు. కరోనా విపత్కర సమయాల్లో వలంటీర్లు సేవలు అమోఘమని ఆయన కొనియాడారు. రానున్న రోజుల్లో వలంటీర్లు బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. 22వ వార్డుల వలంటీర్లను సేవా మిత్ర అవార్డులతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి చిటికిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.